Andhra Jyothi

ఏపీపీఎస్సీకి 40 ఏళ్లు..

# కానిస్టేబుల్‌కు 22 ఏళ్లా?

## వయోపరిమితిపై అభ్యర్థుల్లో కలవరం

**కనీసం 24 ఏళ్లుగా సవరించాలని పోలీసు శాఖ సిఫారసు**

**పట్టించుకోని ప్రభుత్వం.. సమీపిస్తున్న గడువు**

**కానిస్టేబుల్ పోస్టులకు 35 వేల మంది 'ఇంజనీర్లు' పోటీ**

**మొత్తం పోస్టులు 4,548.. ఇప్పటికి దరఖాస్తులు 2 లక్షలు**

**తప్పులుంటే మళ్లీ దరఖాస్తుకు అవకాశం**

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగాల కోసం మూడేళ్లుగా ఎదురు చూసిన నిరుద్యోగులకు కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రకటన వెలువడినా ఆనందం మాత్రం కనిపించడంలేదు. వయో పరిమితిని ఇప్పుడున్న 22 ఏళ్ల నుంచి 24 ఏళ్లకు పెంచాలని నెలన్నర క్రితమే పోలీసుశాఖ ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి ఇప్పటికీ స్పందన రాలేదు. దీంతో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు పోటీ పడుతున్న అభ్యర్థుల్లో వయో పరిమితి అంశం పెద్ద సమస్యగా మారింది. దీనికితోడు స్థానికేతర అంశం, విభాగాల వారీగా ఉద్యోగాలపై స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు కలవరపడుతున్నారు. తమకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఏపీపీఎస్సీ ఉద్యోగాల భర్తీలో వయో పరిమితి 40 ఏళ్లుగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత వయో పరిమితి సడలింపు ఇస్తామన్న ప్రభుత్వం పోలీసు ఉద్యోగాల విషయంలో రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఎందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదని ఉద్యోగార్థులు ప్రశ్నిస్తున్నారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు

# కానిస్టేబుల్‌కు 22 ఏళ్లా?

(మొదటి పేజీ తరువాయి)

18 నుంచి 22 ఏళ్ల వయసును రెండేళ్లు సడలించాలని పోలీసుశాఖ జూలై రెండో వారంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయసును 24కు పెంచితే అప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో 29 ఏళ్ల వయసున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మరోపక్క, కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు గడువు(సెప్టెంబర్ 14) సమీపిస్తుండటంతో ఉద్యోగార్థులలో ఆందోళన నెలకొంది. మూడు వారాల్లో రెండు లక్షల దరఖాస్తులు రాగా అందులో పీజీ, ఇంజనీరింగ్ పట్టభద్రులతోపాటు ఏకంగా పీహెచ్‌డీ స్కాలర్స్ దరఖాస్తు చేసుకోవడం పోలీసు నియామక బోర్డు అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రాష్ట్రంలో 2012 తర్వాత ఉద్యోగ నియామక ప్రకటన లేక పోవడంతో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగి పోయింది. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసి లక్షలాది మంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్ల తర్వాత జూలై 23న పోలీసు ఉద్యోగ నియామక ప్రకటన విడుదల చేయడంతో నిరుద్యోగులు ఆనందపడ్డారు. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకొనే కానిస్టేబుల్ పోస్టులకు పీహెచ్‌డీ పట్టభద్రులతోపాటు సుమారు 35 వేల మంది ఇంజనీరింగ్ పట్టభద్రుల నుంచి దరఖాస్తు రావడం నిరుద్యోగ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. 13 జిల్లాల్లో సివిల్, ఏఆర్ కానిస్టేబుల్, జైల్ వార్డర్ల ఉద్యోగాల్లో 4548 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 28 నాటికి రెండు లక్షలకు పైగా దరఖాస్తులొచ్చాయి. అంటే ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగానికి సుమారు 43 మంది పోటీ పడుతున్నారు. అందులో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారే ఒక్కో పోస్టుకు సుమారు 8మంది ఉన్నారు. ''ఇంజనీరింగ్ పూర్తి చేసి నాలుగైదేళ్లుగా ఖాళీగా ఎదురుచూస్తున్నాం.. ఇప్పుడు ఏదో ఒక ఉద్యోగంలో చేరకుంటే ఇక ప్రభుత్వ ఉద్యోగం ఆశ వదులు కోవాల్సిందే'' అని నిరుద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు.

**ఒక్క జిల్లాకే...**

ఉద్యోగ ప్రకటనలు ఉమ్మడి రాష్ట్రంలో వెలువడినప్పుడు పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసే తమ డీఐజీ పరిధితోపాటు ఆరో జోన్(హైదరాబాద్ రేంజ్)లో కూడా దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అభ్యర్థులు తమ జిల్లా వరకే దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఒక వేళ రెండు దరఖాస్తులు చేస్తే పరిశీలనలో బయట పడితే ఇబ్బందులు తప్పవని రిక్రూట్ మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్ చెబుతున్నారు. ఏదో ఒక్కదానికే హాల్ టికెట్ వస్తుందని, అప్పుడు అయోమయానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.